క్లుప్తంగా

మైనార్టీ రైట్స్ ఫోరం జిల్లా అధ్యక్షుడిగా షాకీర్



తనకల్లు: జిల్లా మైనార్టీ రైట్స్ ఫోరం అధ్యక్షుడిగా కొక్కంటి క్రాస్‌కు చెందిన పీఎం షాకీర్‌ఖాన్‌ను ఎంపిక చేశారు. ఈ మేరకు మైనార్టీ రైట్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ దస్తగిరి నుంచి సోమవారం నియామక పత్రం అందినట్లు తెలిపారు. తనపై నమ్మకంతో వరుసగా రెండోసారి జిల్లా అధ్యక్షుడిగా ఎన్నిక చేసినందుకు ఈ సందర్భంగా షాకీర్‌ఖాన్ కృతజ్ఞతలను తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మైనార్టీల హక్కుల సాధనకు రాజీలేని పోరాటం చేస్తానన్నారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభోత్సవం



వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న సర్పంచ్ జయరామిరెడ్డి

చెన్నేకొత్తపల్లి: పుట్టపర్తి సత్యసాయి బాబా భక్తురాలు సుధా శ్రీనాథ్ ఆర్థిక సహకారంతో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంటును స్థానిక సర్పంచ్ జయరామిరెడ్డి సత్యసాయి భక్తుల ఆధ్వర్యంలో సోమవారం ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మినరల్ వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి సభ్యులు నాగభూషణం, హనుమంత రెడ్డి, నారాయణ స్వామి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ప్రభుత్వ పథకాలు



మాట్లాడుతున్న ఎంపీడీఓ పూల నరసింహులు

తనకల్లు: ప్రభుత్వం పేదలకు అందజేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ పూల నరసింహులు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయితీ కార్యదర్శులు, వెల్ఫేర్, డిజిటల్ అసిస్టెంట్లతో సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని, గ్రామాలలో పథకాలపై అవగాహన కల్పించాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతిరోజు సచివాలయంలో చేపట్టే కార్యక్రమాన్ని ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. బయోమెట్రిక్ హాజరు వందశాతం వేయాలని సూచించారు. అనంతరం జగనన్నకు చెబుదాం ఈకేవైసీ, ఓటీఎస్ చెల్లింపులు తదితర వాటిపై చర్చించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ ఆనందయ్య, సీనియర్ అసిస్టెంట్ హాజీవలి పాల్గొన్నారు.

వేతనాలు విడుదల చేయాలి



నిరసన తెలుపుతున్న కార్మికులు

తాడిమర్రి: నాలుగు నెలల వేతనాలను వెంటనే విడుదల చేయాలని సత్యసాయి తాగునీటి సరఫరా కార్మికులు డిమాండ్ చేశారు. స్థానిక సత్యసాయి తాగునీటి సంపు వద్ద సోమవారం వారు నిరసనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చనిపోయిన కార్మికుల కుటుంబాలు, పదవీ విరమణ చేసిన కార్మికులకు గ్రాట్యుటీ వెంటనే విడుదల చేయాలన్నారు. అలాగే ఈపీఎఫ్, ఈఎస్ఐలను చెల్లించాలన్నారు. సమాన పనికి, సమాన వేతనంతో పాటు లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ బోనస్‌ను వెంటనే ఇవ్వాలని యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తే నిరవధిక సమ్మెకు దిగుతామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ నాయకులు పెద్దఓబిలేసు, సీఐటీయూ నాయకులు రామకృష్ణ, నరసింహారెడ్డి, లక్ష్మీరెడ్డి, సతీష్ పాల్గొన్నారు.

దోమలతో విషజ్వరాలు



ర్యాలీ చేస్తున్న వైద్యులు, సిబ్బంది

ధర్మవరం అర్బన్: దోమలు కుట్టడం వల్ల విష జ్వరాలు వ్యాపిస్తాయని, దోమకాటుకు గురికాకుండా జాగ్రత్తలు పాటించాలని లక్ష్మీ చెన్నకేశవపురం మెడికల్ ఆఫీసర్ సురేష్‌నాయక్, మలేరియా సబ్‌యూనిట్ అధికారి జయరాం తెలిపారు. పట్టణంలో సోమవారం ప్రపంచ దోమల నివారణ దినోత్సవం సందర్భంగా లక్ష్మీచెన్నకేశవపురం మున్సిపల్ ఉన్నత పాఠశాలలో వైద్యులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలతో పాటు విద్యార్థులు ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దోమలు కుట్టడం వల్ల మలేరియా, డెంగీ, చికెన్‌గన్యా, టైఫాయిడ్ తదితర విషజ్వరాలు వ్యాపిస్తాయని తెలిపారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. రాత్రిళ్లు దోమతెరలు వాడాలని సూచించారు. నిల్వ ఉన్న నీటిని వారానికోసారి డ్రైడేగా పాటించి పారబోయాలని తెలిపారు.

రోడ్డు విశాలం.. సులువుగా ప్రయాణం



- తాడిమర్రిలో ముమ్మరంగా రహదారి విస్తరణ పనులు
- స్వచ్ఛందంగా ముందుకొచ్చి సహకరిస్తున్న స్థానికులు

తాడిమర్రి: రోడ్డు విస్తరణతో తాడిమర్రి ప్రధాన బజారు విశాలంగా మారుతోంది. రోడ్డు విస్తరణకు ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారు. ఇరుకు రోడ్డుతో ఎన్నో ఏళ్లుగా అవస్థలు పడుతున్న వాహన చోదకుల సమస్యకు త్వరలో పరిష్కారం లభించనుంది. ఇరుకు బజారు కావడంతో స్థానికులు ఎన్నో అవస్థలు పడుతుండేవారు. ఎదురెదురుగా వాహనాలు వచ్చినప్పుడు వాహన చోదకులు తీవ్ర అవస్థలు పడేవారు. ట్రాఫిక్ క్లియర్ కావడానికి ఒక్కో సారి అరగంటకు పైగా సమయం పట్టేది. సమస్యను డీసీఎంఎస్ చైర్మన్ తాడిమర్రి చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీపీ పాటిల్ భువనేశ్వర్‌రెడ్డిలు ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు వివరించడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాల్యవంతం నుంచి పార్నపల్లి వరకు 30 కిలోమీటర్ల రోడ్డు మేర ఆధునీకరణ కోసం ఆర్‌అండ్‌బీ నిధులు రూ.7 కోట్లు మంజూరు చేశారు.

స్వచ్ఛందంగా తొలగించుకుంటున్నాం



గ్రామంలోని ప్రధాన రహదారి ఇరుకు కావడంతో భారీ వాహనాలు వచ్చినప్పుడు చాలా ఇబ్బందిగా ఉండేది. ద్విచక్ర వాహనాలు నిలుపుకునే అవకాశం లేక ఇబ్బందులు పడేవారు. రోడ్డు విస్తరణ కోసం స్వచ్ఛందంగా ఇళ్లను తొలగించుకుంటున్నాం.

– విశ్వనాథ్, కూరగాయల వ్యాపారి, తాడిమర్రి.

తీవ్ర నష్టం జరిగినా.. స్వాగతిస్తున్నాం



తాడిమర్రి మెయిన్ బజారులో మా ముగ్గురు అన్నదమ్ముల ఇళ్లు ఉన్నాయి. గదులను బాడుగకు ఇచ్చాం. ప్రతినెలా బాడుగ డబ్బు వచ్చేవి. రోడ్డు విస్తరణతో గదులు తొలగించారు. తీవ్రనష్టం జరిగింది. అయినా గ్రామం అభివృద్ధి కోసం పనులను స్వాగతిస్తున్నాం.

– ఓబిలేసు, తాడిమర్రి

ప్రజా ప్రయోజనాల కోసమే..



ప్రజా ప్రయోజనాల కోసమే రోడ్డు విస్తరణ పనులు చేపట్టాం. ఇరుకు రోడ్లతో వాహనదారులు, ప్రజలు తీవ్ర అవస్థలు పడాల్సి ఉంటుంది. విశాలమైన రహదారులే అభివృద్ధికి చిహ్నాలు. ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రోడ్డు విస్తరణకు సహకరించాలి.

– తిప్పేనాయక్, ఆర్డీఓ, ధర్మవరం.

నష్ట పరిహారం అందిస్తాం



తాడిమర్రిలో రోడ్డు విస్తరణతో ఇళ్లను కోల్పోయిన బాధితులకు నష్ట పరిహారం అందించి ఆదుకుంటాం. ఎవరూ ఆందోళన చెందిల్సిన అవసరం లేదు. గ్రామం అభివృద్ధి జరగాలంటే గ్రామంలో ఉండే రహదారులే దోహదపడుతాయి. ప్రజలు సహకరించాలి.

– కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్యే, ధర్మవరం.

సమస్యల పరిష్కారానికే ప్రజల చెంతకు



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

- ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

ధర్మవరం: ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని సత్వరమే పరిష్కరించడం కోసం ఇంటి వద్దకు వచ్చానని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి తెలిపారు. పట్టణంలోని 35వ వార్డులో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కేతిరెడ్డి నిర్వహించారు. ప్రతి ఇంటింటా తిరుగుతూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీ కాలువలను సరిగ్గా శుభ్రం చేయలేదని పలువురు ప్రజలు ఎమ్మెల్యేకు విన్నవించారు. ఎప్పటికప్పుడు కాలువలు, రహదారులు శుభ్రం చేయించాలని మున్సిపల్ అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. తమకు ఇంటిపట్టా వచ్చినా బిల్లులు పడలేదని పలువురు విన్నవించగా.. వెంటనే హౌసింగ్ ఏఈ బాలాజితో మాట్లాడి బిల్లులు త్వరితగతిన పడేలా చూడాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సచివాలయ పరిధిలో చిన్న సమస్య కూడా పెండింగ్‌లో ఉండకూడదన్నారు. అర్హత ఉన్న లబ్ధిదారులకు వారి ముంగిటకే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాల్సిన బాధ్యత సచివాలయ సిబ్బందిపై ఉందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'నవరత్నాల'లో భాగంగా అనేక సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈ వన్నూర్ స్వామి, మున్సిపల్ చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి, వైస్ చైర్మన్లు వేముల జయరామిరెడ్డి, షంషాద్‌బేగం, వార్డు కౌన్సిలర్ మారుతి, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

సబ్ స్టేషన్ వద్ద రైతుల నిరసన

ధర్మవరం రూరల్: మండల పరిధిలోని నేలకోట సబ్‌స్టేషన్ వద్ద సోమవారం రాత్రి ఏలుకుంట్ల, బుడ్డారెడ్డి తదితర గ్రామాలకు చెందిన రైతులు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడుతుండడంతో సబ్ స్టేషన్‌ను ముట్టడించారు. విద్యుత్ శాఖ అధికారులను గదిలో ఉంచి నిరసన తెలిపారు. రైతులు మాట్లాడుతూ కొద్ది రోజులుగా వ్యవసాయ బావులకు వచ్చే విద్యుత్‌ను సక్రమంగా సరఫరా చేయకపోవడంతో పంటలు ఎండుతున్నాయన్నారు. అధికారులకు తెలియజేస్తే వారు నిర్లక్ష్యంగా వ్యవరిస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడకుండా చూడాలని రైతులు కోరారు.

వ్యక్తికి తీవ్ర గాయాలు

ధర్మవరం రూరల్: మండల పరిధిలోని గరుడంపల్లి సమీపంలో సోమవారం ద్విచక్ర వాహనాన్ని బొలెరో వాహనం ఢీకొనడంతో రమేష్‌బాబు అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు, బాధితుడు తెలిపిన వివరాల మేరకు కొత్తచెరువు మండలం ఈరగంపల్లికి చెందిన రమేష్ బాబు తన తల్లితో కలిసి ద్విచక్ర వాహనంలో అనంతపురం నుంచి స్వగ్రామానికి వెళ్తున్నారు. అదే సమయంలో ఎదురుగా వస్తున్న బొలెరో వాహనం ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. రమేష్ బాబు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు చికిత్స నిమిత్తం అనంతపురం ఆసుపత్రికి తరలించారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కార్మికుల బైకు ర్యాలీ

కదిరి టౌన్: మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ చేపట్టారు. సోమవారం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ కార్యాలయం నుంచి అంబేడ్కర్ సర్కిల్, ఇందిరా గాంధి సర్కిల్, జీవిమాను సర్కిల్, ఎగ్బాల్ రోడ్డు, హిందూపురం క్రాస్, టవర్‌క్లాక్ మీదుగా మున్సిపల్ కార్యాలయం వరకు బైక్ ర్యాలీ సాగింది. కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కాంట్రాక్ట్, ఔట్‌సోరింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలని, సీపీఎస్‌ను రద్దు చేయాలని చేపట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు జనార్ధన్, తిరుపాల్, బాలక్రిష్ణ, నరసింహరాజు, సీఐటీయూ నాయకులు జగన్మోహన్, ముస్తక్, రామ్మోహన్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

గర్భగుడుల నిర్మాణానికి భూమి పూజ

తలుపుల: మండలకేంద్రం ఓబీఆర్ రోడ్డులోని అయ్యప్ప ఆలయంలో సోమవారం గణపతి, అయ్యప్ప, అమ్మవారి గర్భగుడుల నిర్మాణానికి శాస్త్రోక్తంగా భూమి పూజ నిర్వహించారు. అర్చకులు చరణ్ శర్మ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో మండలంలోని అయ్యప్ప భక్తాదులు, ప్రజలు పాల్గొన్నారు. పూజ అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

రీ సర్వేతో వివాదాలకు పరిష్కారం



పత్రాలను పంపిణీ చేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

బత్తలపల్లి: భూ వివాదాలకు శాశ్వతంగా తెరదించేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు– భూ రక్ష పథకానికి శ్రీకారం చుట్టిందని ఎంపీపీ బగ్గిరి త్రివేణి, జెడ్పీటీసీ కోటి సుధ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని చెన్నరాయపట్నం గ్రామంలో జగనన్న శాశ్వత భూ హక్కు– భూ రక్ష పథకంలో భాగంగా స్వమిత్వ స్కీం కింద యాజమాన్య ఆస్తి ధ్రువపత్రాల పంపిణీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి సర్పంచు శారదమ్మ అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథులుగా ఎంపీపీ, జెడ్పీటీసీతో పాటు ఈఓఆర్డీ దివాకర్, ఉప సర్పంచు అంజినమ్మ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ జయరామిరెడ్డి, సాగునీటి సంఘం మాజీ అధ్యక్షులు వెంకటరంగారెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ చరిత్రలోనే ఏ రాష్ట్రంలో లేని విధంగా భూ రీ సర్వే కార్యక్రమానికి జగనన్న ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. అనంతరం భూ పట్టాలు, ఇంటి పట్టాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వీఆర్‌ఓ రవికాంత్‌రెడ్డి, కార్యదర్శి అలువేలు మంగమ్మ, సర్వేయర్ కల్పన, సర్పంచులు అక్కిం దామోదర్, సానే జయచంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు, గ్రామ సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా పంటల నమోదు



ఈక్రాప్ నమోదును పరిశీలిస్తున్న దృశ్యం

ఎన్పీకుంట: పంటల నమోదు కార్యక్రమాన్ని పారదర్శకంగా చేపట్టాలని మండల వ్యవసాయ శాఖ అధికారి లోకేశ్వర్‌రెడ్డి తెలిపారు. సోమవారం మండల కేంద్రానికి చెందిన రైతు వెంకటరమణారెడ్డి సాగు చేసిన వేరుశనగ పంట పొలంలో ఖరీఫ్ ఈ క్రాపింగ్ నమోదును మండల అగ్రీ అడ్వైజరీ బోర్డ్ చైర్మన్ ఆదినారాయణరెడ్డితో కలిసి ఏఓ తనిఖీ చేశారు. రైతులు సాగు చేసిన వివిధ పంటలను పరిశీలించి సూచనలు ఇచ్చారు. పంట నమోదు చేసుకుంటే కలిగే లాభాలను వివరించారు. మండల వ్యాప్తంగా 3,567 హెక్టార్లలో రైతులు వివిధ పంటలు సాగు చేశారన్నారు. ఏ ఒక్క రైతు నష్టపోకుండా ఉండాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం పంటల నమోదుపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని తెలిపారు. అగ్రీఅడ్వైజరీ బోర్డ్ చైర్మన్ మాట్లాడుతూ 80 శాతం సబ్సిడీతో ఉలవలను అందిస్తున్నారని, రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. మండలానికి 100 క్వింటాళ్ల ఉలవల కోసం ఇండెంట్ పెట్టారన్నారు. కార్యక్రమంలో వీహెచ్ఏ యుగంధర్, రైతులు పాల్గొన్నారు.

పోస్టర్ల విడుదల



పోస్టర్లు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే సిద్దారెడ్డి

కదిరి టౌన్: స్థానిక తన కార్యాలయంలో సోమవారం ఏపీ అర్చక సమాఖ్య పోస్టర్లను ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి విడుదల చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్చకుల సమస్యలను పరిష్కరించేందుకు అనేక చర్యలు చేపట్టారన్నారు. రాబోవు రోజుల్లో మరింత అండగా ఉంటామన్నారు. ఆలయ చైర్మన్ గోపాలకృష్ణ, అర్చకులు అంజన్ కుమార్ స్వామి, పాలక మండలి సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

విరాళం అందజేత

ధర్మవరం అర్బన్: పట్టణంలోని 28వవార్డు కేతిరెడ్డి కాలనీలో ఆంజనేయస్వామి ఆలయం, పీర్లచావిడి అభివృద్ధికి వార్డు కౌన్సిలర్ సరితాల ఆషాబి, వార్డు ఇన్‌చార్జ్ సరితాల బాషా సోమవారం రూ.40 వేలను అందించారు. కూతురు విద్యజాస్మిన్ చేతులమీదుగా కమిటీ సభ్యులకు నగదు అందజేశారు.

ఆర్యవైశ్య యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శిగా రాఘవేంద్ర



కదిరి అర్బన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్యవైశ్య యువజన సంఘం కార్యదర్శిగా కదిరికి చెందిన వంకధార రాఘవేంద్ర నియమితులయ్యారు. తనకు అవకాశం కల్పించిన మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు ద్వారకనాథ్, డిప్యూటీ స్పీకర్, విజయనగరం శాసనసభ్యులు వీరభద్రస్వామి, విజయవాడ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు వెల్లంపల్లి శ్రీనివాస్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా నాగ పంచమి



నల్లచెరువు: నాగ పంచమి సందర్భంగా మండల కేంద్రంలోని నాగలకట్ట వద్ద సోమవారం ఆర్యవైశ్య మహిళలు నాగదేవతలకు అభిషేకాలు నిర్వహించారు. ఘనంగా పూజలు చేశారు. నాగేంద్రుడి కటాక్షం పొందాలని భక్తిశ్రద్ధలతో పుట్టలో పాలు పోశారు. భక్తులకు అన్నక్కమ్మ కథ చదివి వినిపించి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

మొక్కల పెంపకాన్ని ప్రోత్సహించండి

అమడగూరు: రైతులను మొక్కల పెంపకానికి ప్రోత్సహించాలని ఏపీడీ శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. 5 ఎకరాల లోపున్న రైతులకు మొక్కలను ఉచితంగా ఇచ్చి, మూడేళ్ల పాటు నిర్వహణ ఖర్చులు కూడా ఇవ్వనున్నట్లు తెలిపారు. నూతన ప్రభుత్వ భవనాల వద్ద ఏర్పాటు చేయనున్న రూఫ్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్‌ను తొందరగా పూర్తి చేయాలన్నారు. చీకిరేవులపల్లి, చినగానిపల్లి, అమడగూరు, కస్సముద్రం గ్రామ సచివాలయాలకు మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఆర్‌ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం ప్రకటనపై హర్షం

కదిరి అర్బన్: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు దసరా కానుకగా ఒక డీఏను విడుదల చేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రకటించడం పట్ల ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు శ్రీధర్‌రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయ దినోత్సవం రోజున ఇంగ్లిష్ బోధనా నైపుణ్యాల్లో ఉత్తమ ప్రతిభ చూపిన ఉపాధ్యాయులకు మండల, జిల్లా, రాష్ట్రస్థాయి అవార్డులను అందించాలనడం సంతోషంగా ఉందన్నారు. మూడవ తరగతి నుంచి టోఫెల్ పరీక్ష పెట్టడంతో బడుగు బలహీనవర్గాల విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు.

ఆధార్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి

అమడగూరు: ఆధార్ తప్పులను సరిచేసుకోవడానికి ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామ సచివాలయాల్లో నిర్వహిస్తున్న ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ మునెప్ప ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలో 2010 నుంచి 2016 వరకూ జరిగిన ఆధార్ ఎన్‌రోల్‌మెంట్‌లో చాలా మందికి అడ్రస్‌లు లేవన్నారు. వారంతా క్యాంపులను వినియోగించుకోవాలన్నారు. చీకిరేవులపల్లి, గుండువారిపల్లి, అమడగూరు పంచాయతీల వారికి 22 వ తేదీన అమడగూరులో, తుమ్మల, పూలకుంటపల్లి పంచాయతీల వారికి 23 న తుమ్మలలో, కస్సముద్రం, మహమ్మదాబాద్, జౌకలకొత్తపల్లి పంచాయతీల వారికి 24 న మహమ్మదాబాద్‌లో, 25న చినగానిపల్లి గ్రామ సచివాలయాల్లో ఆధార్ క్యాంపులను చేపడుతున్నట్లు తెలిపారు. సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

బత్తలపల్లి మండలంలో..

బత్తలపల్లి: మండలంలో ఈ నెల 22 నుంచి 25వ తేదీ వరకు ఆధార్ మొబైల్ కేంద్రాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సౌజన్యకుమారి తెలిపారు. 22న అప్పరాచెరువు, సంజీవపురం, 23న రామాపురం, ఈదుల ముష్టూరు, 24న డి.చెర్లోపల్లి, మాల్యవంతం, 25న దంపెట్ల, మాల్యవంతం సచివాలయాలలో తంబాపురం, సంజీవపురం సచివాలయాల డిజిటల్ అసిస్టెంట్‌లు శ్రీకాంత్, గంగాధర్‌లు ఆధార్ అప్‌డేట్, రిజిస్ట్రేషన్ చేస్తారన్నారు. సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కనగానపల్లి మండలంలో..

కనగానపల్లి: ఆధార్ కార్డు రిజిస్ట్రేషన్, అప్‌డేట్ కోసం సచివాలయాల్లోనే ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ అలివేలమ్మ తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. తొలిరోజు 22న తూంచర్ల గ్రామ సచివాలయం, 23న భానుకోట, 24న యలకుంట్ల, 25న దాదులూరు గ్రామ సచివాలయాల్లో ఈ క్యాంపు ఉంటుందన్నారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, విద్యార్థులు సమీప గ్రామ సచివాలయం వద్దకు వెళ్లి ఆధార్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు.

అర్హులందరికీ ఇళ్లు

పుట్టపర్తి: రెండో విడత కింద అర్హులైన వారందరికీ జగనన్న ఇళ్లను మంజూరు చేయాలని బుక్కపట్నం ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఉపాధిహామీ కింద పండ్లతోటల పెంపకానికి అధికారులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మండల అగ్రీబోర్డు చైర్మన్ వెంకటచౌదరి, ఏపీఓ రామకృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అర్జీలకు సత్వర పరిష్కారం

బత్తలపల్లి: ప్రతి సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించే స్పందనలో వచ్చే అర్జీలకు తక్షణం పరిష్కారం చూపాలని తహసీల్దార్ యుగేశ్వరిదేవి పేర్కొన్నారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో 8 అర్జీలు అందినట్లు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ కార్యక్రమానికి ప్రతి అధికారి తప్పక హాజరు కావాలన్నారు. అదేవిధంగా గ్రామ స్థాయిలో గ్రామ సచివాలయ ఉద్యోగులు అందరూ హాజరు కావాలన్నారు. అర్జీలకు సత్వరమే పరిష్కారం చూపాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ సౌజన్య కుమారి, ఏపీఓ ఆదెప్ప, ఏపీఎం సుదర్శన్‌రాజు, ఇంజనీర్ రమణయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వరలక్ష్మీ, ఏఓ ఓబిరెడ్డి, పశువైద్యాధికారి గుర్నాథరెడ్డి, ట్రాన్స్‌కో ఏఈ శివయ్య, ఇతర అధికారులు హాజరయ్యారు.

నేడు సచివాలయ ప్రారంభోత్సవం

గాండ్లపెంట: కటారుపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవన ప్రారంభోత్సవం మంగళవారం ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోరెడ్డి చంద్రశేఖర రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే సిద్దారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొంటారన్నారు. అనంతరం కటారుపల్లి దేవస్థానంలో జరిగే శ్రావణ మాస ఉత్సవాల్లో పాల్గొంటారని తెలిపారు. నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

గంజాయి ముఠా అరెస్ట్

ధర్మవరం రూరల్: ధర్మవరం పట్టణంలో గంజాయిని తరలిస్తున్న 12 మందిని అరెస్ట్ చేసినట్లు వన్‌టౌన్ సీఐ సుబ్రమణ్యం సోమవారం రాత్రి ఓ ప్రకటనలో తెలిపారు. ధర్మవరం చెరువు మొదటి మరువ వద్ద వీరి వద్ద నుంచి కిలో గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.